
# గోవా జానపద గాథలు-కథకులు

రచయిత వి.ఎస్. సుఖ్తంకర్
అనువాదం పాలసుమ్మ పద్మరాజు



## నోరు విప్పదన్నారు...

ఒకరోజు సాయంకాలం సుబ్రాయ్‌శాణే ఇంటిముందు గుర్రబ్బగ్గీ ఒకటొచ్చి ఆగింది. ఇద్దరు పెద్ద మనుషులు, తెల్లటి తలపాగాలూ, మంచి దుస్తులూ వాళ్ళు దర్జాగా దిగారు. ఎనిమిదేళ్ల ఊష్మా పక్కింటి గుమ్మంలో వీళ్ల రాకకోసం కాచి పెట్టుకుని కూర్చుంది. వీళ్లు బండి దిగ్గానే లోపలికి పరిగెత్తి బొమ్మ చెవిలో ఊదింది. బొమ్మ కంగారుగా లేచింది. ఊష్మాని తోడు తీసుకుని శాణేగారి యింటికి బయలుదేరింది. దార్లో మరో అయిదారు గురు అమ్మలక్కల్ని పోగు చేసుకుని మరీ వెళ్లింది. కొందరి చంకల్లో చంటి బిడ్డ లున్నారు కూడా. వచ్చిన అతిథులు యజమానితో ముందు సావిట్లో కూచుని ఉంటారని వాళ్లకి తెలుసు. అందుకని దొడ్డిదారిని బిలబిల వంట ఇంట్లోకి ప్రవేశించారు.

భామాబాయి పళ్లాలలో తినుబండారాలు సర్దుతోంది. పిల్లలు సహాయం చేస్తున్నారు. చీనాకి పన్నెండేళ్ళు. బానా నాలుగేళ్ళు చిన్నది. చీనా బొమ్మలాగుంది. జరీ అంచు ఆకుపచ్చ చీరలో మెడలో బంగారు గొలుసు, చేతులకు గాజులు—చెవులకు దుద్దులు, మహా లక్షణంగా ఉంది. బానా కూడా ఎర్రపట్టు పరికిణీ, జాకట్టు, ఒంటిపేట హారం. తనూ చూడ ముచ్చటగా ఉంది. తల్లి తలెత్తి చూసింది అమ్మలక్కలందరినీ. బిత్తరపోయింది అదేం తెలియనీకుండా చిరునవ్వు తెచ్చి పెట్టుకుని ఆప్యాయంగా లోపలికి రమ్మంది. చీనా ఊష్మా వంక ఉత్సాహంగా చూసింది. అమ్మ అక్కలు చూడడానికి సిగ్గు పడింది.

"చీనా తల్లీ! నిన్ను చూడ్డానికి రెండు కళ్ళూ చాలవే—గౌరీదేవిలా గున్నావు" అంది ఊష్మా బొమ్మ. చీనా చెక్కిలు ఎర్రబడ్డాయి. బొమ్మ భామాబాయిని చీవాట్లు పెట్టింది. "పిల్లని చూడ్డానికి పెళ్లివారొస్తుంటే ఇరుగు పొరుగుని పిలిచి ఈ పనీ ఆ పనీ చెప్పి చేయించుకోవద్దా? సంతోషంగా సహాయ పడతారే అందరూ." ఆమె ఆ మాటందో లేదో, మరో ముత్తైదువు చంకలో బిడ్డని బానా చేతికిచ్చి, చీనాని దగ్గరగా తీసుకుని, "పెళ్లి చూపులకి పిల్లనిల్లాగేటమ్మా పంపించడం? ఇక్కడ కుల కాలం నాటి జడ బొట్టూతో పంపుతారా?" అంటూ చకచక జడ విప్పేసింది. జడ మళ్లీ వెయ్యడం పూర్తి అయిందో లేదో, శాణే అవతలనుంచి "బానా" అని పిలిచాడు. అంటే చీనాని పెళ్లికొడుకు తండ్రికి చూపించడానికి తీసుకురమ్మని ఆ పిలుపు అర్థం. భామాబాయి లేచింది. తిను బండారాలు పెట్టిన పెద్ద పళ్లెం చీనా చేతి కిచ్చింది. చిన్న పళ్లాలు ఒకటి బానా, మరొకటి ఊష్మా పుచ్చుకున్నారు. ఊష్మాకి ఆ అవకాశం రాకపోతే చిన్నబుచ్చుకునేది. ముగ్గుర్నీ ముందు గదిలోకి పంపింది భామాబాయి. రెండు మూడు నిముషాలు అయ్యాక ముగ్గురూ మళ్ళీ వంటింట్లోకి వచ్చేశారు. పెద్దల నవ్వులు, పిన్నల ఎకసెక్కాలతో చీనా చెక్కు లెర్రబడ్డాయి.

పెళ్లిచూపులైపోయాయి. ఆమె తల్లి ఇరుగు పొరుగు అమ్మ లక్కలకి పిండి వంటలు వడ్డిస్తూ మర్యాద చేస్తూనే ఉందిగాని లోలోపల ఎంతో అలజడి పడుతోంది. పర్యవసానం ఏమవుతుందోనని. చీనా ఎక్కువదే కాని, కొంచెం చాయ తక్కువ. అందుకనే తల్లి కంత ఆందోళన. అందుకనే ఈ పెళ్ళిచూపులు రహస్యంగా అట్టే పెట్టింది కూడా. ఈ పెళ్లి వారు సద్దంటే, మందొచ్చే పెళ్లివారు కూడా పిల్లలో ఏదో కొరత ఉందనుకుంటారు. కాని ఇపుడు రహస్యం బట్టబయలయింది. వీరు తిరిగిపోతే వూరంతా యాగీ అవుతుంది. అసలీ సంగతి బయటికెల్లా పొక్కిందో తల్లికి తెలియకపోలేదు. అయినా అప్పటికి మట్టుకు ఆమె ఏమీ అనలేదు. భర్త అడుగుల చప్పుడుకోసం ఆత్రంగా ఎదురు చూస్తూ కూర్చుంది. కాస్సేపట్లో ఆయన వస్తున్న సవ్వడి విని, తొందరగా అవతల గదిలోకి వెళ్లింది ఆయన్ని కలుసుకోడానికి. "శ్రీరూబాబా గారు సరే అన్నారు. పాపం మన భోలా శాణేగారు వూనుకున్నారు గనక సంబంధం కుదిరింది. నేను రేవుదాకా వెళ్లి వారిని లాంచి ఎక్కించి వస్తా" అన్నా రాయన. భామాబాయి సంతోషానికి మేరలేదు. ఇంతలో వంట ఇంట్లోంచి ఆడ గొంతుకలు

ఆయన చెవిని పడ్డాయి.

ముఖం చిట్లించి చూశారాయన.

"నా హెచ్చరికలన్నీ గేదెమీద వాన చినుకులయాయన్నమాట" అనేసి కొంచెం చిరాకుగా వెళ్లిపోయారు.

భామాబాయికా దెప్పి పొడుపు బాధ కలిగించిందిగాని, చీనా సంబంధం కుదిరిందన్న సంతోషంలో అది మరుగు పడిపోయింది. ఆవిడ అతి ఉత్సాహంగా వచ్చింది వంటింట్లోకి.

"మనం అనుకున్నట్టే జరిగింది. అంతా దామోదర ప్రభువు చలవ" అంది. ఆడమ్మలంతా అల్లకల్లోలంగా అభినందించారు. ఈ శుభవార్త వూరంతా చాటడానికి ఊష్ణా బామ్మ హడావిడిగా లేచింది. చీనా చుబుకం పుణికి ఆశీర్వదించింది. అమ్మలక్కలందర్నీ లేవదీసింది. గుమ్మంలో కెళ్లాక వెనక్కి తిరిగి, "అమ్మాయి భామా! చూడు. బానా పెళ్లిచూపులికి మాత్రం ఈ దాపరికం ఒద్దు తల్లీ! మేమంతా వచ్చి సహాయం చెయ్యాలి" అంది.

అంతలో ఊష్ణా అందుకుంది. "అత్తతో ఎందుకు చెప్పడం బామ్మా! ఏం భయం లే. పాపం చీనాలా సిగ్గు పడుతుంది అనుకున్నావేమిటి బానా? ఆ సమయం వచ్చేసరికి వూరంతా అదే చాటేస్తుంది" ఈ చణుకులికి బానా తప్ప మిగతా అందరూ నవ్వారు. ఉష్ణా భుజంమీద ఆప్యాయంగా వేసిన తన చేతులు వెనక్కి లాక్కుని బానా 'హో' అన్నట్టు తోసి ఆమె వంకే కోపంగా చూసింది. ఊష్ణా బామ్మ వస్తున్న నవ్వు చటుక్కున సంబాళించుకుని, మనవరాలి వీపుమీద చిన్న దెబ్బవేసి, "కోతీ, నోరు మూసుకుని ఉండలేవూ? అందరితోనూ వేళాకోళాలే?" అంది.

భామాబాయి వాళ్లని సాగనంపి వంటింట్లోకి వచ్చింది. సామాను సర్దుతూ, చీనా నగలు తీస్తున్న బానా వంక చూడకుండానే, మెల్లని గంభీర స్వరంలో అంది "ఇవాళ పండగింకా అయిపోలేదు. మన రహస్యం బయట పెట్టిన వాళ్ల సంగతి ఇంకా కనుక్కోవాలి. ఎవరో నాకు తెలుసు" బానా బిత్తరపోయింది. వాళ్లమ్మ దగ్గర మరిచి దూరంగా జరిగింది. తలవంచుకు నిలబడింది. భామాబాయి, ఆమె దగ్గరకు వెళ్లింది. రెండు బుగ్గల్నీ రెండు చేతులతో పట్టుకొని తల పైకెత్తి "నేనింతా చెపితే, ఊష్ణాతో ఈ సంగతి ఎందుకు ప్పావు? నా తల్లి పెళ్లంటే ఉష్ణా, నువ్వూ చేసే బొమ్మల పెళ్లనుకున్నావా?" అంది.

"ఊష్ణా ఎవరితోనూ చెప్పనని ఒట్టేసింది. మాట తప్పుతుందనుకోలేదు" అంది బానా ఏడుపు ఎగుపుల మధ్య.

భామాబాయి ఈ మాటలు విని మెత్తబడలేదు. పొయ్యి దగ్గరకెళ్లి పొగూదే గొట్టం పట్టుకొచ్చింది. "మళ్లీ ఇల్లాంటి పని చెయ్యకుండా నీకు బుద్ధి చెపుతా" అంది కోపంగా.

చీనా, "అమ్మా" అంటూ అడ్డుపడింది. బానాని రక్షించడానికిలాగ కౌగిలించుకుంది. బెదురుతూ అమ్మని బతిమాలింది. "అమ్మా! ఇంకెపుడూ చెప్పద్దమ్మా. పొరపాటు తెలిసొచ్చిందిగా? ఒక్కసారి ఒదిలెయ్యమ్మా"

భామాబాయి చేతిలోంచి పొగూదే గొట్టం జారిపోయింది. ఆవిడ మనసు కరిగింది. కళ్లలో కొస్తున్న తడి కనబడకుండా ముఖం కప్పేసుకుంది. చీనా ఎపుడూ బానాని వెనకేసుకొస్తుంది. ఇంక చీనా గూడ విడిచి వెళ్లిపోతుంది. పాపం బానా ఎంత బెంగ పెట్టుకుంటుందో! మనసు కుదుట పరుచుకుని, బానాని దగ్గరగా తీసుకుని, "తల్లీ మనం ఆడవాళ్లం. మితంగా మాట్లాడ్డం చిన్నతనంలోనే నేర్చుకోవాలి మనం. నువ్వూ ఎప్పుడో ఒక ఇంటి కోడలవుతావు. నువ్వు సుఖ పడాలంటే గుట్టు నిలబెట్టడం నేర్చుకోవాలి" అంది.

చీనా సంతోషం పట్టలేక తల్లి భుజాలు పట్టుకుంది. బానా కళ్లు తుడుచుకుందిగాని, ఇంకా దిగులుగానే ఉంది."

"పిచ్చిపిల్లా" అంది భామాబాయి మెల్లగా. చల్లగా నవ్వి బానా చుబుకం ఎత్తి, "నిన్ను చూస్తే ఆ కథలో ముద్ద మాటల పెళ్లికూతురు గుర్తుకొస్తోంది. పెద్దలన్నీ చెపితే, పెళ్లి పీటలమీద రహస్యం కాస్తా బట్టబయలు చేస్తూనే పాడేసింది.

"వోదు విప్పొద్దన్నాదు—మది
వూదు కోదం ఎత్తా?
పెద్దికి పెత్తిన తదంబాదు
పిద్ది తినేత్తోందే—"

ఇంతలో "అక్కయ్యా" అన్న ఆప్యాయమయిన పిలుపు వినబడి ముగ్గురూ గుమ్మం వంక చూశారు.

"హరిమామయ్యా! హరిమామయ్యా!" అంటూ అరిచారు పిల్లలిద్దరూ. ఒక్క గంతులో మేనమామ దగ్గరకు వెళ్లి చెరో పక్కా పట్టుకుని వేళ్లాడారు.

ఈ సంతోష సమయంలో తన చిన్న తమ్ముడు చూడ్డానికి రావడం, భామాబాయికి కడుపు నిండినట్టుంది. అయితే వెంటనే రహస్యం బయట పెట్టే రకం కాదు ఆమె. మనసులో ఆనందం మరుగు పరిచి, ఆమె ముఖం ముడుచుకుని కాస్త ఎత్తిపొడుపు మాటలతో ప్రారంభించింది. "అమ్మయ్య. ఇన్నాళ్లకి మీ అక్కయ్యా, మేనకోడళ్లూ గుర్తు కొచ్చారన్నమాట!" అంటూ నిట్టూర్చింది.

"అవును మామయ్యా! నువ్వచ్చి మూణ్నెల్లపైగా అయింది. నిజంగానే మర్చిపోయావు" అన్నారు మేనకోడళ్లిద్దరూ.

"అవునమ్మామరి" అన్నాడు హరిమామయ్య. కాస్త గంభీరంగా ముఖం పెట్టి, "తప్పు మీ అమ్మది. ఇప్పుడేగ మీకా ముద్ద మాటల పెళ్లికూతుర కథ చెప్పింది? మరి మామయ్యా దారి తప్పకుండా ఎల్లా ఉంటాడు? పగలల్లా మీ అమ్మ కథలు చెపుతుంటే, ఇక్కడి కొద్దామని బయలు దేరిన మామయ్య తప్పకుండా దారి మరిచిపోతాడు!"

ఈ 'మామయ్యా దారి తప్పడం' చిత్రమయిన కట్టు కథ. అస్తమానూ చిన్న పిల్లలు కథలు చెప్పమని వేధించుకు తినకుండా గోవా ముసలమ్మలు కల్పించారిది. కథలు చెపితే వాళ్లని చూడ్డానికి బయలు దేరిన మామయ్యా దారి తప్పుతాట్ట! మామయ్య వస్తున్నాడంటే మహా సరదా పిల్లలకి — బాగా చనువిస్తాడు, గారం చేస్తాడని.

"మామయ్య దారి తప్పడం" సంగతి సమయానుకూలంగా హరిమామయ్య ఎత్తే సరికి వంటిల్లంతా నవ్వులతో కలకల్లాడింది.

"చాల్లేరా హరీ! నీ వేళాకోళాలు. నీకో మంచి శుభవార్త చెప్పాలి. అంతా శ్రీ దామోదర ప్రభువు చలవ" అంటూ అతి ఉత్సాహంగా తమ్ముణ్ణి హాల్లోకి తీసుకు వెడుతూ, చీన్నా పెళ్లి చూపుల సంగతంతా పూసగ్రుచ్చినట్టు అతి చమత్కారంగా చెప్పింది భామాబాయి. ఇంక చినాకి, బానాకి ఏం చెయ్యాలో ఎవరూ చెప్పక్కర్లేదు. "షిరా" చెయ్యడానికి ఇద్దరు పొయ్యి దగ్గరకు పరుగెత్తారు. మావయ్యకా ఫలహారం మహా ఇష్టం. భామాబాయి ఈ శుభవార్త చెప్పడం ముగించేసరికి, ఫలహారం, కాఫీ పట్టుకుని వాళ్ళొచ్చారు. మామయ్య కిచ్చారు.

మామయ్య ఫలహారం తృప్తిగా తిని, కాఫీ తాగి, చీనా వంటని మెచ్చుకుని, తన గారాల మేనకోడలైన బానాని ఆప్యాయంగా పక్కని కూచోపెట్టుకుని, ఒక పొట్లం ఆమెకు చూపిస్తూ అన్నాడు. "ఈ పొట్లంలో అద్భుతమయిన వింత లున్నాయి. మా వూరి సంతలో కొన్నాను మీ ఇద్దరికోసం, షిరా తిన్నానుగాని కడుపు నిండలేదు. బానా తల్లి కథలు మహా కమ్మగా చెపుతుంది. ముద్దమాటల పెళ్లి కూతురు కథ ఇది వరకు విన్నాను గాని, మా మేనకోడలు నోటంట మళ్లీ వినాలనుంది."

# గోవా జానపద గాధలు

మామయ్యకి కథ చెప్పడమంటే, మేనకోడలికి మహా సరదాకదా. అయినా మరో మాటు అడిగించుకుని మొదలుపెట్టింది కథ.

"అనగాగనగా ఒక మారుమూల వూరు. ఆ వూళ్లో ఉందొక చిన్న పిల్ల. చాలా చక్కనిది. వాళ్ల నాన్న బాగా డబ్బున్నవాడు. అయితే పాపం ఆ అమ్మాయికి ముద్ద మాటలు! పెళ్లీడొచ్చేసరికి తల్లి తండ్రులకి ఆమె పెళ్లి పెద్ద సమస్యయిపోయింది. పాపం ఆ వూళ్లో అందరూ ఆమెను ఎగతాళి చెయ్యడమే. ముద్ద మాటలపిల్లని ఎరగనివారంటూలేరు. కాని వాళ్ల నాన్న మహా తెలివైనవాడు. ఏం చేశాడు? ఓరోజుని దూరంగా ఉన్న మరో వూరెళ్లారు. అక్కడ అందమయిన కుర్రాణ్ణొకణ్ణి చూసి అల్లుణ్ణి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కుర్రాడి తల్లి తండ్రుల దగ్గర కెళ్లాడు. మంచి కట్నం ఇస్తానన్నాడు. ఆ తల్లితండ్రులు తమ కుర్రాడి కింత కట్నం వస్తుందని కలలో కూడా అనుకోలేదు. వెంటనే వాళ్ళు ఒప్పుకున్నారు.

"పెళ్లి అసలు పెళ్లి కూతురు ఇంటి దగ్గర జరగాలి. అయినా—ఏదో వంక బెట్టి పెళ్లి మగపెళ్లివారి వూళ్లోనే జరగాలన్నాడు.

"ఉత్సాహంగా ఇంటికి తిరిగొచ్చాడు. తను ఎలాంటి తెలివయిన పథకం వేశాడో పెళ్లానికి చెప్పాడు. అయితే ముద్దమాటల పిల్ల బాగా వాగుడుకాయి. అంచేత జ మూడు ముళ్ళూ పడేదాకా అసలు నోరు విప్పొద్దని తల్లీ తండ్రీ ఆ పిల్లని మరీ మరీ హెచ్చరించారు.

ముహూర్తంనాటికి ఆడ పెళ్లివారు మగ పెళ్లివారి వూరు చేరుకున్నారు. తతంగం ప్రారంభమైంది. అగ్నిహోత్రం వెలుగుతోంది. పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. సన్నాయి హాయిగా మ్రోగుతోంది. పిల్లని చక్కగా అలంకరించి పెళ్లి పీటలమీద కూర్చోపెట్టారు. పెళ్లి కొడుకు వచ్చేదాకా ఆమె ఆ పీటమించి కదలకూడదు. నోరు విప్పొద్దన్న హెచ్చరిక మరోసారి ఆదుర్దాగా ఆమె చెవిలో వూదింది తల్లి. అంతా సవ్యంగానే సాగిపోతోంది. కాని అయ్యో పాపం! చటుక్కుని పెంపుడు పిల్లొకటి ఎదురుగా ఉన్న గదిలోకొచ్చింది. పెద్ద పళ్లెంలో తలంబ్రాల బియ్యం పెట్టి ఉన్న యక్కడ. పిల్లి ఆ బియ్యం బొక్కడం మొదలు పెట్టింది. మిగతా ఆడవాళ్లంతా తలో పనిమీద హడావిడిగా తిరుగుతున్నారు. పందిట్లో పెళ్లికూతురొక్కర్తే కూచుని ఉంది. పిల్లిని ఆమె చూసింది. ఆమె కంగారుపడుతూ కూర్చుంది. ఆఖరికి ఇంక ఉండబట్టలేక అరిచింది—

"నోదు విప్పొద్దన్నాదు—మది
వూదుకోదం ఎత్తా?
పెద్దికి పెత్తిన తదంబాదు
పిద్ది తినేత్తుందే—

ముద్ద నాలుక లేకపోతే ఆమె అనదలుచుకున్నది ఇది—

'నోరు విప్పద్దన్నారు—మరి
వూరుకోడం ఎల్లా
పెళ్లికి పెట్టిన తలంబ్రాలు
పిల్లి తినేస్తుందీ—"

మగ పెళ్లివారి ఆడంగులు బిత్తర పోయారు. ఆడపిల్లవాళ్ల మొగాన్ని నెత్తురు చుక్కలేదు. పెళ్లి పందిరంతా పిడుగు పడ్డట్టైపోయింది. పాపం ఆ పాడు పిల్లి మూలంగా ముద్ద మాటల పిల్ల పెళ్లి చెడిపోయింది. మళ్లీ తన వూరికి తిరిగొచ్చేసింది" కథ పూర్తి చేసిందో, లేదో మామయ్య చేతులో పొట్లం—టప్పున లాగేసింది బానా. ●

